# సాగిపో నేస్తం

ఉదయాన్నే లేవాలనుకున్నా ఎందుకో ఆ రోజు బాగా ఆలస్యమయింది. ఈపాటికి పేషెంట్లు క్యూలో ఉంటారు..... హడావిడి పడుతూనే హాస్పిటల్ కు పరుగెత్తాను. వైజాగ్ కింగ్ జార్జి హాస్పిటల్ లో సివిల్ సర్జన్ గా జాయిన్ అయిన తరువాత కనీసం ఒక్కరోజు కూడా రిలీఫ్ దొరకలేదు. పైగా అన్నీ ఎమర్జన్సీ కేసులే! వూపిరి సలపనంత 'ఒత్తిడి'—పనిభారం.

మారుతీ కారు లాక్ చేసి నా రూంలో అడుగుపెట్టానో లేదో'డాక్టర్!! డాక్టర్!'కంగారుగా పరుగెత్తుకొచ్చాడు వార్డ్ బాయ్.

''ఎందుకయ్యా అంత కంగారు! మామూలుగా అడిగాననుకున్నాను కాని నా కంఠంలో కొంచెం చిరాకు ధ్వనించిందని నాకు తెలుసు.

''ఓ పేషెంటు పరిస్థితి ప్రమాదకరంగా ఉంది సార్.... మీరు త్వరగా రావాలి... వచ్చినవైపే పరుగు తీశాడు వార్డు బాయ్

డాక్టర్ వృత్తి చేపడితే ఇలానే ఉంటుంది. అదీ ప్రభుత్వ డాక్టరయితే మరీ చులకన. మనసులో విసుక్కుంటూనే వార్డు వైపు నడిచాను. పేషెంట్ బెడ్ దగ్గర నర్సు. వార్డుబాయ్ తప్ప ఎవ్వరూ లేకపోవడం నాకు ఆశ్చర్యం వేసింది. ఇదేదో అనాధ కేసు అనుకుని పేషెంటు ముఖం వైపు పరిశీలనగా చూశాను.

అంతే! ఓ క్షణం షాక్ కు గురయ్యాను.

మల్లెమొగ్గలా స్వచ్ఛంగా, తెల్లగా అందాల బొమ్మలా ఉండే కవిత ఈమేనా? తళుక్కున మెరిసి ఓ క్షణం గుబులు పుట్టించే ఆ సుందరి కళ్ళ క్రింద నల్లటి వలయాలు ఏమిటీ! గుంటలు పడ్డ కళ్ళు, కరిగి పోయిన పరువం, చిక్కి శల్యమయిన ఆ పసిడి సౌందర్యం... నా నోట మాట బయటకు రావడం లేదు. మూగవాడిలా ఆమెనే చూస్తున్నాను. గుండెల్లో అణగద్రొక్కబడిన మూగవేదన నెమ్మదిగా రగులుకుంటోంది. అయితే, ఆ పరిస్థితి కొన్ని క్షణాలు మాత్రమే! వెంటనే ఆమెకు ప్రాథమిక చికిత్స చేసి నర్సుకు అన్ని జాగ్రత్తలు చెప్పి నా రూంకి వెళ్ళాను.

రిలాక్స్ అవ్వాలని ఎంత ప్రయత్నించినా సాధ్యం కావడం లేదు. గులాబీ మొగ్గలా మనోహరంగా ఉండే ఆమె రూపం నాలో ఫ్లాష్ లా వెలుగుతోంది. ఏడాదిలో కవితలో ఎంతమార్పు? ''తన జీవితాన్ని ఎందుకు నాశనం చేసుకుంది!'' సమాధానం దొరకని రకరకాల ఆలోచనలు నన్ను కమ్ముకుంటుంటే కొన్ని క్షణాలు బాధగా కళ్ళు మూసుకున్నాను.

సరిగ్గా ఏడాది క్రితం నా సొంత నర్సింగ్ హోమ్ లో నర్సుగా జాయిన్ అయ్యింది కవిత. ముత్యంలా మెరిసిపోయే ఆమె సౌందర్యం చాలా త్వరగా నన్నాకర్షించింది. పొలమరుగులా పొంగుతున్న పరువం నా సొంతం కావాలని అప్పుడే నిర్ణయించుకున్నాను. ఏ ప్రొఫెషనల్ కయినా అందమైన ఆడది తోడుంటే అద్భుతాలు చేయొచ్చు అనడానికి నేనే నిదర్శనం'' ఆ ఏడాదిలో డాక్టర్ గా నేనెంతో ముందుకు సాగిపోయాను!

నిజానికి ఏరోజన్నా కవిత హాస్పిటల్ కు రాకపోతే నాకు పిచ్చెక్కినట్టుండేది. రోజూ నావైపు మాటిగా గుండెల్లో గుచ్చుకునేలా చూసే కవిత చూపులు నన్ను ఉక్కిరిబిక్కిరి చేసేవి! ఒక్కమాటలో చెప్పాలంటే.... 'ఆమె నా స్వప్న దేవత''

ఒకరోజు... రాత్రి ఏడుగంటలు కావస్తోంది. కవిత కోసం ఎవరో ఓ పాతికేళ్ళ యువకుడు వచ్చాడు. మా బాయ్ ఫ్రెండ్ వచ్చాడని చెప్పి వెళ్ళింది. అయితే నేనా విషయాన్ని అంతగా పట్టించుకోలేదు. తర్వాత కొన్నిరోజుల్లో ఆమె ప్రవర్తనలో వూహించని మార్పులొచ్చాయి. ఆమెకోసం వచ్చే బాయ్ ఫ్రెండ్స్ సంఖ్యకూడా పెరిగింది. అయితే, జరుగుతున్నదేమిటో అర్థం చేసుకోలేని అవివేకిని మాత్రం కాదు నేను.

అయినా 'నా బలహీనత నాకు తెలుసు''!!

ఆ బలహీనతే కవితను ప్రేమించేలా చేసింది. మనసు బాధతో నలుగుతున్నప్పటికీ ఆమెపై ఉన్న ప్రేమను మర్చి పోకుండా చేసింది.

మానసికంగా టెన్షన్ అనుభవించేకన్నా నా ప్రేమను ఆమెకు చెప్పటానికే నిర్ణయించుకున్నాను. ఆ తర్వాత నాలో కొంచెం రిలీఫ్.....

''కవితా'' పేషెంట్స్ ను చూస్తున్న ఆమెను పిలిచాను. నా పిలుపులో కొంచెం తడబాటుఉంది. అది గ్రహించిన దానిలా నవ్వుతూ నావైపు వచ్చింది. కూర్చోమని చెప్పగానే....

''ఫర్వాలేదు చెప్పండి' అంది

''నేనో అమ్మాయిని ప్రేమించాను. పెళ్ళి కూడా చేసుకోవాలనుకుంటున్నాను. ఆ అమ్మాయిని నీవోసారి చూస్తే.....


''అలాగే! ఇంతకీ మీకు నచ్చిన ఆ అమ్మాయి ఎవరు?

''నువ్వే ఎందుకు కాకూడదు'' ఎదురు ప్రశ్నవేశాను!

కొద్దిసేపు నావైపు విస్మయంగా, విభ్రాంతితో చూసి చూపులు టక్కున క్రిందకు వాల్చుకుంది.

ఆ తరువాత నెమ్మదిగా నడచి వెళ్ళిందే తప్ప ఒక్క మాటైనా పలకలేదు.

మర్నాడు ఉదయాన్నే హాస్పిటల్ లో అడుగు పెట్టగానే ఆతృతతో, మనసు నిలవక ఆమెకోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. అయితే! ఆమె



రాలేదు. కొన్నిరోజులు గడిచాయి. అసలు రాదన్న నిజం తెలిసాక కన్నీళ్ళన్నీ బయటకు వచ్చేదాకా ఏడ్చాను. నా ప్రేమ ఆమె అంగీకరించకుండా వెళ్ళినంతమాత్రాన సముద్రాలుపొంగలేదు. అగ్ని పర్వతాలు బద్దలు కాలేదు.

''అయితే''.... నా మనసు క్షోభకు గురైంది. బాధతో నలిగిపోయింది.

*** *** ***

అలా నా నర్సింగ్ హోం వదిలి వెళ్ళిన కవిత భయంకరమైన స్థితిలో దయనీయమైన దీనావస్థలో దొరికిన ఆధారం వదులుకుని తాత్కాలిక సుఖాలు ఎండమావులుగా భ్రమించి— చివరకు చేజారిన

ఉదయం నవతరం వారపత్రిక


జీవితం ఆమెను కాల్చుకు తింటుందేమో...

తిరిగి నేనున్న హాస్పిటల్‌లో.....!!

అంతా విచిత్రంగా ఉందికదూ!

నెమ్మదిగా.. ఆమెలో పూర్వపు అందం రూపుదిద్దుకుంటోంది. మనిషి ఉల్లాసంగా కన్పించడానికి ప్రయత్నిస్తోంది. ఆమెలో కన్పిస్తున్న పాజిటివ్ లక్షణాలకు నేను ఆనందభరితుడినయ్యాను.

అయితే, అప్పుడప్పుడూ నన్ను చూస్తేచాలు ఏదో అపరాధం చేసినదానిలా తలదించుకుంటోంది.



ఓసారి నాకేదో చెప్పాలని ప్రయత్నిస్తే నేనే ఆమెదగ్గరగా కూర్చున్నాను. ''మీకు కృతజ్ఞతలు ఎలా చెప్పుకోవాలో నాకు పాలుపోవడం లేదు. మీకు అభిమానంగా ఇవ్వడానికి కూడా నాదగ్గర ఏమీ లేదు'' అంది నెమ్మదిగా.

నువ్వు ఇవ్వగలిగేది, నేను తీసుకునేది ఒకటుంది? అది నేనే అడిగి తీసుకుంటాను!.... అర్థోక్తిగా అనేసి వెళ్ళి పోయాను.

'ఆరోజు ఆదివారం' నా రౌండ్స్ త్వరగా పూర్తి చేసి కవిత దగ్గరకు వెళ్ళాను.

ఆమె ఎంతో ఫ్రెష్‌గా ''గుడ్ మార్నింగ్ డాక్టర్'' అంది.

''గుడ్‌మార్నింగ్! సరేగాని నీకోగుడ్ న్యూస్.''

''ఏమిటిది?''

''రేపు నిన్ను డిశ్చార్జి చేస్తున్నాను తెలుసా!''అన్నాను.

అంతే! ఒక్కసారిగా ఆమె ముఖం మాడిపోయింది. కలవరపాటుగా ఓ క్షణం నావైపు చూసింది. ఆమె ముఖంలో మారుతున్న ఫీలింగ్స్ కొంటెగా ఎంజాయ్ చేస్తున్నాను నేను.

''కవితా! నిన్ను డిశ్చార్జి చేసి తిన్నగా నా ఇంటికి తీసుకెళ్తాను!. నువ్వేమీ వర్రీ కానవసరం లేదు. నీకు తోడుగా......''అప్పుడే చెప్పాలనిపించలేదు. 'వెయిట్ ఫర్ టుమారో'' అని చెప్పి వెళ్ళి పోయాను.

తిరిగి నాలో అలజడి సన్నగా మొదలయింది. కవిత నా కోరిక అంగీకరిస్తుందా! అసలు ఆమె ఉద్దేశ్యం ఏమిటి? అంతా పిచ్చిపిచ్చిగా ఉంది. అసలు ప్రేమించడమే ఓ పిచ్చి. అలా ఆలోచిస్తూ ఆ రాత్రి గడిపాను.

ఉదయం లేవగానే నాలో టెన్షన్ మొదలయింది. కవిత నిస్సందేహంగా నా భార్య కావాలి. ఎదురుకాబోయేది వూహించుకుంటూ, ఓ ప్రత్యేక మనసు ఆనందంతో పరుగులు తీస్తుంటే నా మారుతి కారును కె.జి.హెచ్ వైపు పోనిచ్చాను. హాస్పిటల్‌కు నా కారు చేరగానే నాలో టెన్షన్ పెరిగిపోయింది. నరాలన్నీ జివ్వునలాగుతున్న ఫీలింగ్. ఎలాగైతేనేం భరించలేని ఉద్వేగంతో కవిత ఉన్నవార్డువైపు పరుగులు తీశాను.

అంతే! కవిత బెడ్‌కు కొంచెం దూరంలో నా కాళ్ళు టక్కున ఆగిపోయాయి.

ఆమె ఉండాల్సిన బెడ్ ఖాళీగా నన్ను వెక్కిరిస్తోంది. వెర్రిగా చూస్తున్న నాదగ్గరకు వచ్చి 'ఆమె వెళ్ళిపోయింది సార్!' అన్నాడు వార్డ్ బాయ్.

పిచ్చిగా అరవాలనిపించింది ఆ క్షణంలో. నిస్సత్తువగా వెనుదిరుగుతున్న నన్ను ఆపి 'సార్! ఈ లెటర్ మీకు అందించమన్నారు ఆవిడ,' అని నాచేతిలో పెట్టాడు వార్డుబాయ్.

మడతపెట్టిన కాగితం వైపు నా చూపులు పరుగెట్టాయి.

డియర్ శరత్!

మీ పాదాలు తాకి మీకు కృతజ్ఞతలు చెప్పుకోవాలనుకున్నాను. అయితే మలినమైన నా చేతులకు మీ పాదాలుతాకే అర్హత లేదని తెలిసి నా కళ్ళన్నీ ఇంకిపోయేలా ఏడ్చాను. ఒకనాడు మీ పవిత్ర ప్రేమను కాదని నేను పతనమై పోయాను. నాకున్న బలహీనతే నన్ను నాశనం చేసింది. మీ ప్రేమ గొప్పది. మీరో అపురూపమైన వ్యక్తి. వెలకట్టలేని వ్యక్తిత్వం మీది. మీరు నన్ను డిశ్చార్జిచేసి మీ ఇంటికి తీసుకెళ్తారని నాకు తెలుసు. ఆ తర్వాత నన్ను మీ అర్థాంగిగా చేసుకోవాలనుకుంటున్నారనీ తెలుసు. కనీసం మీ వూహల్లో సంచరించడానికి కూడా పనికిరాని వ్యక్తిని. దైవ సన్నిధికి చేరకుండానే నలిగిపోయిన పుష్పాన్ని. మీ ప్రేమను అందుకునే అర్హత నాకు లేదు. అందుకే మీ నుండి దూరంగా..... మీ ప్రేమను ఆదర్శంగా చేసుకుని... కొత్త జన్మకోసం మిమ్మల్ని కాదని.... వెళుతున్న నన్ను ఓ మంచి స్నేహితురాలిగా గుర్తుంచుకోండి. మీ ఆశలు విరిచేసిన నన్ను మనసారా క్షమించండి. నాకు మరోజన్మపై నమ్మకం లేదు. ఈ జన్మలో మాత్రం మీ ప్రేమను అందుకోలేని దురదృష్టవంతురాలిని...

అందుకే! ప్రియతమా నన్ను మనసారా మన్నించు''

ఇట్లు
కవిత

''రెండుసార్లు నా హృదయాన్ని తాకిన ప్రేమ కెరటం తీరం వదిలి వెళ్ళిపోయింది నన్ను ఒంటరివాడ్ని చేసి''

కోరం రాజబాబు